# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 04 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4




## రోడ్డు ప్రమాదాల నివారణకు 'రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ' వెబ్‌సైట్ కీలకం

- మంత్రి పోన్నం ప్రభాకర్
- సచివాలయంలో వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి

వివరాలు 4వ పేజీలో

# మంత్రులు జిల్లాలకు వెళ్లండి

- జిల్లాలకు వెళ్లి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు చేపట్టాలి
- గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్‌లదే
- పాత, కొత్త నేతల సమన్వయం అవసరం
- ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలపై సీఎం సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో మంగళవారం కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులందరూ తమకు కేటాయించిన జిల్లాలకు వెళ్లి ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. సర్వేల్లో వెనుకబడిన మున్సిపాలిటీల పనితీరుపై సీఎం విశ్లేషణ చేశారు. జిల్లా పర్యటనల వివరాలను మంత్రుల నుంచి అడిగి తెలుసుకున్న సీఎం, ఎప్పటికప్పుడు ఇన్‌ఛార్జ్ మంత్రులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రోజువారీగా నివేదికలు అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో ఆశించి భంగపడిన అసంతృప్త నేతలను బుజ్జగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని పేర్కొంటూ, సమష్టిగా పనిచేస్తేనే అన్ని స్థానాల్లో విజయం సాధ్యమని గట్టిగా చెప్పారు. పాత, కొత్త నేతల సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రులకు సూచనలు చేశారు. ఎన్నికల గెలుపు బాధ్యత పూర్తిగా పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లదేనని సీఎం స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అందరూ తమ ఇన్‌ఛార్జ్ బాధ్యతల్లోనే కొనసాగాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే పీసీసీ చీఫ్, పార్టీ వార్‌రూమ్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సుమారు రెండు గంటల పాటు మంత్రులతో సమావేశమైన సీఎం, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు. నాయకులు సమన్వయంతో పనిచేస్తే కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం వస్తుందని సర్వేలు సూచిస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు కనీసం వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఉండి మున్సిపాలిటీలవారీగా రాజకీయ పరిణామాలను గమనించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలో 12,907 మంది అభ్యర్థులు

- 6,701 నామినేషన్ల ఉపసంహరణ
- 10,086 నామినేషన్లు తిరస్కరణ
- ఇక ప్రచారంపై ఫోకస్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల్లో మంగళవారం రాత్రి 10 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం పోటీలో మొత్తం 12,907 మంది అభ్యర్థులు నిలిచారు. తొలుత 29,694 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో 10,086 నామినేషన్లు పరిశీలన సమయం లో ఎన్నికల అధికారులు తిరస్కరించారు. మంగళ వారం మరో 6,701 నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అభ్యర్థులు ఖరారు కావడంతో రాజకీయపార్టీలు ఇక ప్రచారంపై దృష్టి పెట్టాయి.

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పార్లమెంటు స్థానాల ఇన్‌చార్జి మంత్రులతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చించారు. ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఇక బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగనుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఆయన శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మున్సిపల్ ఎన్నికల కోసం బహిరంగ సభలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అక్క డి నుంచి గ్రేటర్ హైదరాబాద్ మినహా అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో సుడిగాలి పర్యటన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యేలకు స్థానిక నాయకత్వ సమన్వయ బాధ్యత లు అప్పగించారు.

బీఆర్‌ఎస్ కూడా బుధవారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు కూడా అన్ని మున్సి పాల్టీల్లో ప్రచార పర్యటనలు పెట్టుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మెన్లు, జిల్లా అధ్యక్షులకు ప్రత్యేక బాధ్య తలు అప్పగించారు. మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేసేలా, కేడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. బీజేపీ కూడా ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించింది. ఈనెల 11న పోలింగ్, 13న ఫలితాలు, 16న మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్ల ప్రమాణస్వీకారాలు జరుగుతాయి.

# దేశానికి రైల్వే హబ్‌గా హైదరాబాద్



- కావచ్ కేంద్రం, హైస్పీడ్ కారిడార్లతో కీలకంగా మారనున్న నగరం
- హైదరాబాద్‌ను యాదగిరిగుట్టతో అనుసంధానించే ఎంఎంటీఎస్ మూడో దశకు త్వరలో ప్రధాని భూమిపూజ
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కావచ్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్‌కు కేంద్రం ఏర్పాటు కావడం, 2026--27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైస్పీడ్ రైల్ కారిడార్లతో హైదరాబాద్ దేశంలోనే ప్రధాన రైల్వే హబ్‌గా అవతరించనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ విషయాలు వెల్లడించారు. తెలంగాణలో ప్రస్తుతం రూ.47 వేల కోట్లకు పైగా విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 30కు పైగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు 2026 నాటికి పూర్తవుతాయని చెప్పారు.

రాష్ట్రంలో మొత్తం 1,242 కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ ఉండగా, అందులో ఇప్పటికే 627 కిలోమీటర్ల మేర కావచ్ వ్యవస్థ అమలు చేసినట్లు తెలిపారు. కావచ్ వ్యవస్థకు సంబంధించిన పరిశోధన కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ కేంద్రంగా ఉండటం విశేషమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్--పుణె, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్లు తెలంగాణ రాజధానినుంచే ప్రారంభం కానున్నాయని తెలిపారు. "ఇప్పటికే హైదరాబాద్, తెలంగాణ అనేక రంగాల్లో హబ్‌లుగా ఎదుగుతున్నాయి. కావచ్ కేంద్రం, హైస్పీడ్ రైల్ కారిడార్లతో హైదరాబాద్ దేశంలోనే కీలక రైల్వే కేంద్రంగా మారనుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం నగరం ఔషధ, వ్యాక్సిన్, రక్షణ, ఐటీ రంగాల్లో ప్రధాన కేంద్రంగా ఉందని గుర్తు చేశారు.

హైదరాబాద్‌ను యాదగిరిగుట్టతో అనుసంధానించే మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) మూడో దశకు త్వరలో ప్రధాని

మిగితా 2వ పేజీలో

# 'రైతు నేస్తం'లో రైతులతో మంత్రి తుమ్మల ముఖాముఖి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లాభాలను మంత్రికి వివరించారు. ప్రత్యేకంగా యూరియా యాప్ అమలుపై మంత్రి రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా మరింత పారదర్శకంగా, సులభంగా జరుగుతుందని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. యూరియా అందుబాటు, సమయానికి సరఫరా వంటి అంశాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో -- పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇఫ్కో సంస్థ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు, డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు మరియు వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన కల్పించారు.

'రైతు నేస్తం' కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విదేశీ పర్యటనల్లో సీఎం.. ఆస్పత్రుల్లో పేద విద్యార్థులు

- గురుకులాల పరిస్థితి అధ్వాన్నం
- పాము కాటుకు గురైన విద్యార్థిని ఘటనకు సీఎం బాధ్యత వహించాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి విదేశీ పర్యటనల్లో ఫొటోలకు పోజులిస్తూ హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లుతున్న సమయంలో, ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రుల్లో ప్రాణాల కోసం పోరాడు తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. తమ పిల్లలు చదువుకోడానికి వెళ్తున్నారా..? లేక చావుతో పోరాడడానికి వెళ్తున్నారా..? అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితినే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అధ్వాన్నం చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాము కాటుకు గురై ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న ఘటనపై ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. పాము కాటుకు గురైన విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని హరీష్ రావు స్పష్టం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేస్తోందని పేర్కొంటూ, "రేవంత్ రెడ్డి గారు.. మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేక విషసర్పాలకు ఆవాసాలా..?" అని ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా? అంటూ రేవంత్ రెడ్డిని నిలదీశారు. రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అంటూ రంగుల లోకం చూపిస్తూ, గురుకులాలను పూర్తిగా గాలికి వదిలేయడం సిగ్గుచేటని విమర్శించారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదని, చిమ్మచీకట్లో వెలుగులు వెలిగించే నాథుడు కూడా లేడని ఆరోపించారు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో కుక్కకాట్లు, పాము కాట్లు నేడు సర్వసాధారణంగా మారాయని, ఇది అత్యంత దుర్మార్గమైన పరిస్థితి అని హరీష్ రావు మండిపడ్డారు. గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదని, ప్రాణాలకు భద్రత కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలని, రాజకీయ కక్షసాధింపులపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా పేద పిల్లల ప్రాణాల రక్షణపై పెట్టాలని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు

# కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి.. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయండి
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం నమోదు చేయాలి
- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల బరిలో భారత రాష్ట్ర సమితి ఘనవిజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగరవేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, మున్సిపల్ కోఆర్డినేటర్లు మరియు జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని, ఇచ్చిన హామీల అమలులో విఫలమై మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బీజేపీలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఎన్నికల వ్యూహంలో భాగంగా అందరి సమన్వయం కీలకమని కేటీఆర్ స్పష్టం చేశారు. చాలా చోట్ల పార్టీ విజ్ఞప్తిని మన్నించి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికి అభ్యర్థులు స్వయంగా వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. వారికి తగిన గౌరవం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉందన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని సూచించారు.

చివరి ఘట్టమైన ప్రచారంపై దృష్టి సారిస్తూ, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు మరియు మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడం పైన కూడా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని సూచించారు.

## రెండేళ్లయినా అందని 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు..

- ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ ముఖం చాటేయడం నిస్సిగ్గు చర్య!
- తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో..
- నిరుద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

## కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసు

- నేడు స్పీకర్ ముందు హాజరు కానున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై బుధవారం అసెంబ్లీ స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్ విచారణ నిర్వహించనున్నారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గౌడ్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై స్పందిస్తూ స్పీకర్ కార్యాలయం సోమవారం కడియం శ్రీహరికి నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

మిగితా 2వ పేజీలో

# లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం

- అమెరికా ఒత్తిడికి మోదీ తలొగ్గారు : ఎంపీ రాహుల్ గాంధీ
- ఆర్మీ మాజీ చీఫ్ రాసిన పుస్తకంలోని అంశాలపై చర్చించాలంటూ ప్రతిపక్షనేతల ఆందోళన
- ఎనిమిది మంది ఎంపీల సస్పెన్షన్
- బడ్జెట్ సెషన్ ముగిసే వరకు నో ఎంట్రీ : దిలీప్ సైకియా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా స్థంభించాయి. స్పీకర్ చైర్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు సభ్యులు కాగితాలు చించి విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ ఘటనపై కఠినంగా స్పందించిన స్పీకర్ మొత్తం బడ్జెట్ సమావేశాల కాలానికి ఎనిమిది విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు.

మంగళవారం మధ్యాహ్నం పలు మార్లు వాయిదా పడిన అనంతరం, మధ్యాహ్నం 3 గంటలకు లోక్‌సభ తిరిగి ప్రారంభమైంది. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ఎంపీ దిలీప్ సైకియా సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కొందరు సభ్యులు పత్రాలు చించి స్పీకర్ వైపు విసరడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సభా నియమాలను ఉల్లంఘించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను గుర్తించారు. సస్పెండ్ అయిన వారిలో హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్, రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. మిగిలిన బడ్జెట్ సమావేశాల కాలానికి వీరిని సస్పెండ్ చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం గందరగోళం కొనసాగడంతో లోక్‌సభను బుధవారానికి వాయిదా వేశారు.



ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21st సెంచరీ' ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి మంత్రివర్గ సహచరులు అభినందనలు తెలియజేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి , జూపల్లి కృష్ణా రావు, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేశారు.



## డీఆర్‌డీఓ విజయవంత పరీక్ష...

- ఎలైట్ దేశాల సరసన భారత్
- ఎస్ఎఫ్‌డిఆర్ క్షిపణి సాంకేతికతలో భారత్ చారిత్రక ముందడుగు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

అత్యాధునిక క్షిపణి సాంకేతికతలో భారత్ మరో కీలక మైలురాయిని సాధించింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్ఆర్) సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొద్ది దేశాలకే సాధ్యమైన ఈ సాంకేతికతను భారత్ సొంతం చేసుకోవడంతో రక్షణ రంగంలో దేశ స్థాయి మరింత పెరిగింది.

ఒడిశా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి ఫిబ్రవరి 3, 2026న ఉదయం 10.45 గంటల ప్రాంతంలో ఈ పరీక్ష నిర్వహించారు. ప్రయోగం అన్ని దశల్లోనూ ఆశించిన విధంగా విజయవంతమైందని డీఆర్‌డీఓ అధికారులు వెల్లడించారు. ఈ విజయం ద్వారా రామ్‌జెట్ ఆధారిత క్షిపణి సాంకేతికతను కలిగి ఉన్న ఎలైట్ దేశాల జాబితాలో భారత్ చేరింది. ముఖ్యంగా తదుపరి తరం, దీర్ఘశ్రేణి ఎయిర్ టు ఎయిర్ క్షిపణుల అభివృద్ధికి ఇది కీలకంగా ఉపయోగపడనుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శత్రు విమానాలను అత్యంత దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం కలిగిన క్షిపణుల తయారీలో ఈ సాంకేతికత గేమ్‌చేంజర్‌గా మారనుందని విశ్లేషిస్తున్నారు.

**అభినందించిన కేంద్ర రక్షణ మంత్రి**

ఎస్ఎఫ్‌డిఆర్ సాంకేతికతను విజయవంతంగా ప్రదర్శించినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను అభినందించారు. ఈ పరీక్షలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ బృందాలను రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యంపై కేసు నమోదు

- తిరుపతిలో విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్ కలకలం
- నటుడు మోహన్‌బాబు, మంచు విష్ణు సహా 20 మందిపై ఎఫ్ఐఆర్

**బలగం టీవి, తిరుపతి**

తిరుపతిలో విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్ వ్యవహారం తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించి మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యంపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అధిక ఫీజులపై నిరసన తెలపడానికి వెళ్లిన విద్యార్థి సంఘం నేతలను యూనివర్సిటీ బౌన్సర్లు బలవంతంగా కిడ్నాప్ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

పోలీసుల కథనం ప్రకారం.. మోహన్‌బాబు యూనివర్సిటీలో అధిక ఫీజుల వసూళ్లు చేస్తున్నారని నిరసిస్తూ విద్యార్థి సంఘం నేతలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘం నేతలైన అక్బర్, వినోద్‌లను యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు వాహనంలో బలవంతంగా ఎక్కించి తీసుకెళ్లారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై విద్యార్థి సంఘం నేత బండి చలపతి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే మూడు ప్రత్యేక బృందాలను

మిగితా 2వ పేజీలో

### రోడ్డు ప్రమాదాల నివారణకు

# ‘రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ’ వెబ్‌సైట్ కీలకం

- **మంత్రి పొన్నం ప్రభాకర్**
- **సచివాలయంలో వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ‘రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ’ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఈ వెబ్‌సైట్‌ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులతో కలిసి ప్రతిజ్ఞ చేయించే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. విద్యార్థులతో ఉన్న బలమైన బంధం ద్వారా కుటుంబాలపై సానుకూల ప్రభావం చూపి రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ వేదికగా క్షేత్రస్థాయిలో ప్రతి మోటార్ వాహనదారుడికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా రవాణా శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని ఒక పెద్ద ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణలో బాధ్యతా యుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత అనేది కేవలం చట్టాల అమలుతోనే పరిమితం కాదని, కుటుంబాలు, పిల్లలు, తెలంగాణలోని ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని మంత్రి గుర్తు చేశారు. ఈ వెబ్‌సైట్ రోడ్డు భద్రత పట్ల ప్రభుత్వానికి ఉన్న బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పెట్టెం తదితర అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్లయినా అందని 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు..

- **ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ ముఖం చాటేయడం నిస్సిగ్గు చర్య!**
- **తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో..**
- **నిరుద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం.**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గారి మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ గారి హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో “రిక్రూట్‌మెంట్ జీరో”గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు.జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు.

తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ గారి పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు.ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు

# లోక్‌సభలో మాట్లాడే హక్కును హరించారు

- **స్పీకర్‌కు రాహుల్ గాంధీ లేఖ...**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



లోక్‌సభలో మాట్లాడేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా తనకు కల్పించిన హక్కును హరిస్తున్నారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పీకర్ అడ్డుకున్నారని విమర్శించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నాయకుడు మాట్లాడకుండా అడ్డుకున్న ఘటన ఇది అని రాహుల్ పేర్కొన్నారు. ఇది భారత ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తుందని తెలిపారు. ఈ చర్యకు వ్యతిరేకంగా తాను నిరసన తెలుపుతున్నట్లు లేఖలో స్పష్టం చేశారు. జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశంపై లోక్‌సభలో మాట్లాడకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం చేశారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. జాతీయ భద్రత వంటి అంశాలపై పార్లమెంటులో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**సంప్రదాయాలకు విరుద్ధం: రాహుల్**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడనివ్వకపోవడం సంప్రదాయ ఉల్లంఘనేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్య హక్కులను హరించారని విమర్శించారు. సభలోని ప్రతి సభ్యుడి హక్కులను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత స్పీకర్‌పై ఉందని ఆయన గుర్తు చేశారు.సభలో ఒక పత్రాన్ని ప్రస్తావించాలనుకునే సభ్యుడు దానిని ధృవీకరించి, అందులోని అంశాలకు బాధ్యత వహించాల్సిన సంప్రదాయం ఉందని రాహుల్ లేఖలో పేర్కొన్నారు. తాను అదే విధంగా వ్యవహరించానని, గత స్పీకర్ల తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

సభలో సభ్యుడు లేవనెత్తిన అంశంపై స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అయితే ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి తనను మాట్లాడకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు.

# దేశానికి రైల్వే హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ భూమిపూజ చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు ఇప్పటివరకు ఐదు వందే భారత్, రెండు అమృత్ భారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని ఆయన చెప్పారు. 2026--27 కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉందని, 2047 నాటికి ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధన దిశగా ఇది కీలక అడుగుగా నిలుస్తుందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)కు కేటాయింపులు రూ.88 వేల కోట్ల నుంచి రూ.96 వేల కోట్లకు పెంచామని తెలిపారు. ఈ పథకాన్ని బలహీనపరుస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు.ప్రపంచంలోని అనేక దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగమిస్తోందని చెప్పారు. ఈ బడ్జెట్ తక్షణ ప్రయోజనాలకన్నా దేశ దీర్ఘకాలిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధికి బలమైన పునాది వేసిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ పార్టీకి చెందిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఆరోపిస్తూ వారందరిపై అనర్హత వేటు వేయాలని పార్టీ స్పీకర్‌ను కోరింది. అయితే ఇప్పటివరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేల విషయంలో వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చి, వారికి క్లీన్‌చిట్ ఇచ్చారు. కడియం శ్రీహరి వ్యవహారంపై బుధవారం విచారణ జరగనుండగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌లపై దాఖలైన అనర్హత పిటిషన్లపై ఇంకా తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. భారత రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న స్పీకర్, ఈ పిటిషన్లను పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు.

# మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యంపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి కిడ్నాప్‌కు పాల్పడిన వాహనాన్ని చేజ్ చేసి అడ్డగించారు. ఈ సమయంలో కిడ్నాప్‌కు పాల్పడ్డట్లు భావిస్తున్న మోహన్‌బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌కు గురైన విద్యార్థి సంఘం నేతలను సురక్షితంగా రక్షించారు. బండి చలపతి ఫిర్యాదు మేరకు నటుడు మోహన్‌బాబు, మంచు విష్ణు, యూనివర్సిటీకి చెందిన వీఆర్‌వో సతీష్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎ1గా సతీష్, ఎ2గా మోహన్‌బాబు, ఎ3గా మంచు విష్ణుబాబు పేర్లు నమోదు చేసినట్లు సమాచారం. ప్రధాన నిందితులతో పాటు మరో 20 మందిపై కూడా కేసులు పెట్టారు.

నిందితులపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 191(2), 115(2), 140(1), 126(2), 351(2), తీ/ష 190, 61(2) కింద (క్రైం నెంబర్: 23/2026) కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, మోహన్‌బాబు యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే అమలు చేయాలని విద్యార్థి సంఘాలు గత కొంతకాలంగా ఆందోళనలు చేపడుతున్నాయి. ఉన్నత విద్యామండలి ఆదేశాలను ధిక్కరిస్తూ విద్యార్థులను వేధిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు ఆరోపించారు. అయితే ఈ అంశంపై యూనివర్సిటీ యాజమాన్యం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు.

## హన్మకొండ జూలాజికల్ పార్క్‌లో తెల్ల పులి మృతి

- **వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని జూ అధికారులు వెల్లడి**

**బలగం టీవీ, హన్మకొండ**

హన్మకొండ హంటర్ రోడ్డులోని జూలాజికల్ పార్క్‌లో ఉన్న తెల్ల పులి ‘శరణ్’ మంగళవారం తెల్లవారుజామున తన ఎన్‌క్లోజర్‌లో మృతి చెందింది. వృద్ధాప్యం కారణంగా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు గురై శరణ్ మృతి చెందినట్లు జూ అధికారులు తెలిపారు. తెల్ల పులి మృతి చెందిన అనంతరం మంగళవారం అంత్యక్రియలు నిర్వహించినట్లు జూ పార్క్ పర్యవేక్షణ అధికారి వెల్లడించారు. శరణ్‌ను గత జూలై నెలలో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ నుంచి హన్మకొండ జూకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

## సిగాచి కేసులో నిందితులకు బెయిల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం లోని సిగాచి కర్మాగారంలో పేలుళ్ల కేసులో నింది తులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఫ్యాక్టరీ ఎమ్‌డీ, కార్యనిర్వహక డైరెక్టర్ అమిత్ రాజ్ సిన్హాకు బెయిల్ ఇచ్చింది. ఇండిపెం డెంట్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవీంద్ర ప్రసాద్ సిన్హా, బిందు వినోదన్, ధనలక్ష్మి, జనా ర్ధన్‌రెడ్డిలకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. వ్యక్తిగతంగా లక్ష రూపాయల పూచీకత్తు ఇవ్వాలనీ, మరో ఇద్దరితో లక్ష రూపాయల చొప్పున రెండు గ్యారెంటీలను కింది కోర్టుకు సమర్పించాని ఆదేశించింది. మేజిస్ట్రేట్ కోర్టు లో లొంగిపోయి బెయిల్ పొందాలంది. కేసు విచారణకు సహకరించడమే కాకుండా సాక్షులను ప్రభావితం చేయరాదనీ, బెదిరించరాదని షరతు విధించింది.

## జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **ట్రాక్టర్ బోల్తా... నలుగురు వ్యవసాయ కూలీలు మృతి**

**బలగం టీవీ, జగిత్యాల**

జగిత్యాల జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో నలుగురు వ్యవసాయ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మల్లాపూర్ మండలం ముగిలిపేట గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాధితులు ఉదయం పసుపు కోత పనుల కోసం పొలాలకు వెళ్లారు. పసుపు కోత పూర్తయ్యాక ట్రాక్టర్‌లో తిరిగి వస్తుండగా ముగిలిపేట సమీపానికి చేరుకున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న నీటి గుంతలో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఐదు నెలల ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులకు గడువు తేదీ పొడగింపు..

- **రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా. వి. రవీందర్ రెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల స్టడీ సర్కిల్, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే 2025-26 సంవత్సరానికి ఐదు (5) నెలల ఫౌండేషన్ కోర్సు (రాష్ట్రస్థాయి అన్ని పోటీ పరీక్షలతోపాటుగా,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కొరకు బ్యాంకింగ్, ఆర్.ఆర్.బీ, ఎస్.ఎస్.సి., మరియు అన్ని ఇతర పోటీ పరీక్షలు), భోజన వసతి సౌకర్యాలతో పాటు స్టడీ మెటీరియల్స్ అందించే ఉచిత శిక్షణ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అర్హులైన ఎస్.సి., ఎస్.టి. బి.సి., మైనారిటీ మరియు వికలాంగుల స్త్రీ/పురుష అభ్యర్థుల నుండి ఆన్లైన్ వెబ్ సైట్ హ్ట్టప్స్://టీజీసీఏఎస్ఈ-ఏసీఎస్ఏ.ఓ.ఇన్ ద్వారా తేది. 22-02-2026 వరకు దరఖాస్తుల గడువు తేదీ పొడగించడం జరిగింది. కావున, ఇట్టి సదావకాశాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన అభ్యర్థులందరూ వినియోగించుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి గారు ప్రకటన ద్వారా తెలిపారు. పూర్తి వివరాలను http://tsstudycircle.co.in వెబ్ సైట్ లో చూడగలరు, ఇతర వివరాలకు డైరెక్టర్ ఎస్సీ స్టడీ సర్కిల్ రాజన్న సిరిసిల్ల ని ఫోన్ నెంబర్ 8341387700 కి సంప్రదించగలరు.



## మున్సిపల్ ఎన్నికల తనిఖీల్లో రూ. 1.30 లక్షల నగదు స్వాధీనం..

- **సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు సిరిసిల్ల టౌన్ పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో సోమవారంఉదయం తంగళ్ళపల్లి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన SST చెక్‌పోస్ట్‌లో జరిపిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. సోమవారం రోజు ఉదయం సుమారు 11:46 గంటలకు, సిరిసిల్ల మండలం తంగళ్ళపల్లి బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన కేఏ 40 ఎన్ 4315 నంబర్ గల కారును ఆపి తనిఖీ చేశారు. కారు డ్రైవర్/యజమాని అయిన మోహిత్ కుమార్ బీఎస్ వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ. 1,30,000/- (అక్షరాలా ఒక లక్ష ముప్పై వేల రూపాయలు) నగదును గుర్తించడం జరిగింది. సదరు వ్యక్తి ఈ నగదుతో కర్ణాటక నుండి జగిత్యాల జిల్లాలోని పోరండ్ల గ్రామానికి వెళ్తున్నట్లు విచారణలో తెలిపాడు. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపనందున దీనిని అనుమానాస్పద నగదుగా పరిగణించి స్వాధీనం చేసుకున్నాము. నారా బృంద ఇన్‌చార్జ్ శ్రీకాంత్ సమక్షంలో పంచనామా నిర్వహించి, నగదును చట్టపరంగా స్వాధీనం చేసుకున్నాము. ఈ నగదు యొక్క మూలం మరియు దానిని దేనికోసం తరలిస్తున్నారు అనే అంశంపై తదుపరి విచారణ కొనసాగుతోంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ హెచ్చరించారు.



## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఆశా డే కార్యక్రమంలో భాగంగా తనిఖీ నిర్వహించినైనది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తో పాటు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సమీక్షలో ఆశా కార్యకర్తలు విధిగా గర్భిణీ స్త్రీల నమోదు సకాలంలో చేసి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి, గర్భిణీ స్త్రీల చెకప్ తో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని, జిల్లాలో సెక్స్ రేషియో తక్కువగా ఉన్నందున బాలికల జననాలు ఎక్కువగా జరుగునట్లు మరియు ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేసిన హాస్పిటల్ సమాచారం వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి తెలియజేయాలని ఆశా కార్యకర్తలకు, సిబ్బందికి దిశా నిర్దేశించినారు. ఈ కార్యక్రమంలో చీర్లవంచ వైద్యాధికారి డాక్టర్ శరణ్య మరియు సిహెచ్ఓ బాలచంద్రం, రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

2024--25 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 16-02-2026 చివరి తేదీ అని, రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 28-02-2026 చివరి తేదీ అని వెల్లడించారు. జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం మిల్లర్లు బాధ్యతగా భావించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్ లో లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకునేలా ముందుచూపుతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాబాయి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు.

భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో రూ. 1000 వేద ఆశీర్వచనం, రూ.500 స్పెషల్ కోడె, రూ. 300 స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఈలు జయకుమార్, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు.. 39 వార్డులకు బీజేపీ అభ్యర్థులు ఖరారు..

- **బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మొత్తం 39 వార్డులకు గాను, భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటికే సోమవారం రోజున తొలి విడతలో 23 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా, మిగిలిన 16 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన రెండో విడత జాబితాను బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధికారికంగా వెల్లడించారు. దీనితో మొత్తం 39 వార్డులకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన పూర్తయినట్లయ్యింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, బిజెపి సీనియర్ నాయకులు గజ బింకర్ చందు తదితరులు పాల్గొన్నారు





Bjp Sircilla Municipality Candidates Final Submit List

| SI.No | Ward Number | Candidates Name's | Mobile Number |
|---|---|---|---|
| 1 | 1 | Bura Vishnu | 9618288156 |
| 2 | 2 | Dumala Srikanth | 9490563227 |
| 3 | 3 | cheppadandi swaroopa Rani | 9505994399 |
| 4 | 4 | M Sravanthi | 9398196230 |
| 5 | 5 | dudham Usha Shri | 9705022011 |
| 6 | 6 | injapuri Navya | 9866999956 |
| 7 | 7 | Erram Venkat rajam | 9440414546 |
| 8 | 8 | Jangiti Pushpa | 7893186770 |
| 9 | 9 | Teku Sandhya | 9441840496 |
| 10 | 10 | sunkari Manjula | 9494405751 |
| 11 | 11 | mamedala Mahesh | 9177414786 |
| 12 | 12 | MogiliSudhakar | 9014917286 |
| 13 | 13 | vadnala Shekar | 9392777595 |
| 14 | 14 | pokala Bhavani | 9963557793 |
| 15 | 15 | Vadhnuri Mamatha | 6303272496 |
| 16 | 16 | gajala Jagan | 8247876360 |
| 17 | 17 | myana Ram Prasad | 9440155866 |
| 18 | 18 | Merugu Manjula | 9490126382 |
| 19 | 22 | malladapeta Bhaskar | 9959013986 |
| 20 | 23 | Annaldas Lalitha | 9297009695 |
| 21 | 24 | Guntuka Manjula | 9440072382 |
| 22 | 26 | Guntuka koteshwar | 9440072382 |
| 23 | 39 | vadnala Satyanarayana | 8367758331 |

## విద్యారంగానికి, తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం..



- **బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026--27 కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా విమర్శించారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని కనీసం పట్టించుకునే పరిస్థితి కూడా లేదని మండిపడ్డారు. బడ్జెట్‌లో చేసిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేకుండా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో వారు నోరు మెదపలేని దయనీయ స్థితిలో ఉన్నారని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని కూర్చోవడం సిగ్గుచేటు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదే టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంటులో ఉంటే తెలంగాణకు ఈ స్థాయిలో అన్యాయం జరిగేది కాదని గుర్తు చేశారు. బడ్జెట్ ప్రసంగాలు ఎంత గొప్పగా చేసినా, పేదలు–మధ్యతరగతి ప్రజలకు విద్య మాత్రం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు. ఫీజులు, విద్యా ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ, విద్యార్థులకు ఊరట కలిగించే ఒక్క నిర్ణయం కూడా ఈ బడ్జెట్‌లో లేదని విమర్శించారు. విద్యారంగ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బడ్జెట్‌ను పునః సమీక్షించి, విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను వెంటనే మంజూరు చేయాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అరెల్లి వినయ్, మహమ్మద్ అమీర్, కుర్ర విష్ణు, సోహెల్, షైక్ షోయెబ్ అక్తర్, పల్లపు మణి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- మున్సిపల్ ఎన్నికల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్
- హాజరైన రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికలకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ.. పురపాలక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరగాలని సూచించారు.

పోలింగ్ కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్ పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం సంసిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ప్రవీణ్, అన్వార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి

- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర డీజీపీ శివధర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు మరియు ఇతర పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు, పోలింగ్ మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల చట్టాలు మరియు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులు, ఎన్నికల వేళ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు మరియు అనుమానితులను బైండోవర్ చేయాలని సూచించారు.

రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు పోలీసు అధికారులకు మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో చట్టాల అమలు,నిబంధనల పాటింపు ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలను వివరంగా వివరిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో తీసుకుంటున్న చర్యల వివరాలను డీజీపీ కి తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు కిరణ్, రామ్మోహన్, వినితా రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఆత్మాభిమానం లేని చోట ఉండలేను..

- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నాను
- సామాజిక ఉద్యమకారుడు లింగంపెల్లి మధుకర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గత 18 ఏళ్లుగా సామాజిక ఉద్యమాల్లో నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రముఖ ఉద్యమ నేత లింగంపెల్లి మధూకర్ నేడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, స్థానిక కాంగ్రెస్ నాయకత్వం తనను అవమానించిన తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా లింగంపెల్లి మధూకర్ మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడిగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సాధన కోసం జైలు జీవితం గడిపిన వ్యక్తిగా నా సుదీర్ఘ పోరాట చరిత్రను పార్టీ విస్మరించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి సమక్షంలో పార్టీలో చేరినప్పటికీ, కనీసం స్థానిక కౌన్సిలర్ స్థానాన్ని కూడా కేటాయించలేదంటే.. సిరిసిల్ల కాంగ్రెస్‌లో సామాజిక, రాజకీయ పరిపక్వత కలిగిన వారికి స్థానం లేదా అని ప్రశ్నిస్తున్నాను. ఏ నియోజకవర్గంలోనైనా ఆశావాదులు ఉండటం సహజం. కానీ, కనీసం అభ్యర్థులతో చర్చించకుండా, ఏకపక్షంగా నిర్ణయాలు ప్రకటించడం అప్రజాస్వామికం. ఇది రాజకీయ ప్రక్రియ కాదు, నాలాంటి నిబద్ధత కలిగిన కార్యకర్తల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమే. 18 ఏళ్ల నా సామాజిక శ్రమకు, ఉద్యమ నేపథ్యానికి విలువ లేని చోట ఉండలేక, భారమైన హృదయంతో కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానని తెలియజేశారు. సిరిసిల్ల గడ్డపై నిరంతరం ప్రజా పక్షాన నా పోరాటం కొనసాగుతుందని, భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్ మృతి

**బలగం టీవీ, చెన్నై**



ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్ (70) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు బుధవారం చెన్నైలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వార్తతో సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్పీ వెంకటేశ్ సినీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమైంది. 1971లో సాధారణ గిటారిస్ట్‌గా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన ఆయన, సంగీతంపై ఉన్న అపారమైన ఆసక్తి, కఠిన కృషితో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదిగారు. ప్రముఖ సంగీత దర్శకుల వద్ద సహాయకుడిగా పనిచేస్తూ అనుభవం సంపాదించిన అనంతరం స్వతంత్ర సంగీత దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమలో ఆయన తనదైన ముద్ర వేశారు. 1990ల దశకంలో వచ్చిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలకు ఆయన అందించిన సంగీతం సినిమాలకు ప్రాణం పోసింది. 'కిలిక్కం', 'ధృవం', 'కౌరవర్' వంటి చిత్రాల పాటలు నేటికీ సంగీతప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాయి. తన సుదీర్ఘ సినీ జీవితంలో ఎస్పీ వెంకటేశ్ మలయాళం, తమిళం, హిందీ, బెంగాలీ తదితర భాషల్లో 250కి పైగా చిత్రాలకు సంగీతం అందించారు. పాటలకే పరిమితం కాకుండా ఆయన అందించిన నేపథ్య సంగీతం (బ్యాక్‌గ్రౌండ్ స్కోర్) సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది.ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు, కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డులు సహా పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు.




# 'ధురంధర్ 2' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ మరోసారి తన భీకరమైన అవతారంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యాడు. బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ధురంధర్' మొదటి భాగం తర్వాత రూపొందుతున్న సీక్వెల్ 'ధురంధర్ 2: ది రివెంజ్' టీజర్ తాజాగా విడుదలైంది. టీజర్ చివర్లో రణ్‌వీర్ సింగ్ పలికిన "యే నయా హిందుస్థాన్ హై... యే ఘర్ మే ఘుసేగా భీ ఔర్ మారేగా భీ" అనే డైలాగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఇదే డైలాగ్‌ను దర్శకుడు ఆదిత్య ధర్ తన గత బ్లాక్‌బస్టర్ 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్'లో ఉపయోగించడం గమనార్హం. ఒక నిమిషం 12 సెకన్ల నిడివి గల ఈ టీజర్‌లో రణ్‌వీర్ పోషిస్తున్న హమ్జా అలీ మజారీ పాత్ర నేపథ్యాన్ని చూపించారు. పాకిస్థాన్‌లోని ల్యారీ టౌన్‌ను శాసించే ఓ క్రూరమైన గ్యాంగ్‌లో అతడు ఎలా ఎదిగాడో, స్పైగా మారకముందు అతని జీవితం ఎలా ఉందో ఈ టీజర్‌లో ఆసక్తికరంగా చూపించారు. టీజర్‌తో పాటు "అబ్ బిగడ్నే కా వక్త్ ఆ గయా హై" అనే క్యాప్షన్‌తో కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ చిత్రానికి ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తుండగా, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్, ఆదిత్య ధర్ ఫిలిమ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ట్రైలర్ విడుదల

- మేనల్లుడు జాఫర్ జాక్సన్ నటనతో అభిమానుల్లో ఉత్కంఠ

**బలగం టీవి, హైదరాబాద్**




పాప్ సంగీత ప్రపంచానికి చిరస్మరణీయమైన దిగ్గజం మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'మైఖేల్' సినిమా ట్రైలర్‌ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన సొంత మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషిస్తుండటం విశేషం. ట్రైలర్‌లో జాఫర్ జాక్సన్ తన నటన, డ్యాన్స్ మూమెంట్స్, బాడీ లాంగ్వేజ్‌తో అచ్చం మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేస్తూ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. ముఖ్యంగా మైఖేల్‌కు ప్రత్యేకమైన డ్యాన్స్ స్టెప్స్, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, మైఖేల్ జాక్సన్ చిన్నతనం నుంచి గ్లోబల్ సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లను, తండ్రి జో జాక్సన్‌తో ఉన్న సంక్లిష్టమైన సంబంధాలను కళ్లకు కట్టినట్లు చూపించనుంది. ఈ సినిమాలో కోల్మన్ డొమింగో, నియా లాంగ్ మైఖేల్ జాక్సన్ తల్లిదండ్రుల పాత్రల్లో నటిస్తుండగా, మైల్స్ టెల్లర్ కీలకమైన మేనేజర్ పాత్రలో కనిపించనున్నారు. 'మైఖేల్' చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ట్రైలర్ విడుదలతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఈసీ తీరుపై మమత ఆగ్రహం

**బలగం టీవి, హైదరాబాద్**

బంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బాధితులకు కనీసం తమ వాదన వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మమత బెనర్జీ ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల నష్టపోయిన బంగాల్‌కు చెందిన బాధితులను మీడియాకు పరిచయం చేశారు. "నా వెనుక కూర్చున్నవారంతా ఎస్ఐఆర్ బాధితులే. వీరి పేర్లను అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. నేను కొంతమందిని మాత్రమే ఇక్కడికి తీసుకురాగలిగాను. కావాలంటే ఇలాంటి లక్షల మంది బాధితులను ఢిల్లీకి తీసుకురాగలను. అయినా వీరికి జరిగిన అన్యాయంపై మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వడం లేదు" అని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టిన సమయాన్ని మమత సూటిగా ప్రశ్నించారు. "అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ఈ హడావుడి ఎందుకు? ఎన్నికల ముందు ఇలాంటి చర్యలు తీసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? కేవలం రెండు నుంచి మూడు నెలల వ్యవధిలో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా ఇంత పెద్ద ప్రక్రియను ఎలా పూర్తి చేస్తారు?" అని ఆమె నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నాయని మమత ఆరోపించారు. "త్వరలో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ విపక్షాలు అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో మాత్రమే ఎస్ఐఆర్ చేపడుతున్నారు. మరి బీజేపీ అధికారంలో ఉన్న అస్సాంలో ఎందుకు చేయడం లేదు? అక్కడ ఎందుకు మినహాయింపు ఇచ్చారు?" అని ప్రశ్నించారు.ఈసీ చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఓటు హక్కును హరించేలా ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు.